నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలోని శ్రీ విఘ్నేశ్వర, నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర దత్తాత్రేయ నవగ్రహ అభయాంజనేయ ఉమామహేశ్వర ఆలయంలో గురువారం నుంచి 8వ తేదీ వరకు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అవంతినగర్ తోట రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం గణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, భిక్షాధారణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, వాస్తు నవగ్రహ క్షేత్ర పాలక యోగిని సహిత సర్వతోభద్ర మండల ఆహ్వాన కలశ స్థాపన, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్ఠతో ఈ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఎన్టీఆర్ నగర్‌లోని షిర్డీ సాయిబాబా దేవాలయ 4వ వార్షికోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు లక్ష్మీగణపతి, వాస్తు, నవగ్రహాల హోమాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న సమారాధన, శుక్రవారం తెల్లవారుజామున 5.30 నుంచి 7 గంటల వరకు పాలాభిషేకం, అనంతరం సాయిబాబా వారి దివ్య అలంకరణ, ఉదయం 11.45 గంటలకు ప్రత్యేక కోవాతో కేక్ సమర్పించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, సాయంత్రం 6.30 గంటలకు పురవీధుల్లో పల్లకీ సేవా ఉంటుందని తెలిపారు. ఈ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంత వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అబాకస్‌లో జెన్‌నెక్ట్స్ విద్యార్థుల ప్రతిభ



అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మోతీనగర్: వీ ఫోకస్ ఎడిట్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ జెన్‌నెక్ట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులకు పాఠశాల చైర్మన్ జితేంద్ర, ప్రిన్సిపాల్ లత జ్ఞాపిక, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అదేవిధంగా జాతీయ ఓపెన్ మార్షల్ ఛాంపియన్ పోటీలో గాయత్రినగర్‌కు చెందిన పాఠశాల విద్యార్థి ఎం. మణి సాయి నాయుడు ప్రతిభ చూపాడు. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

మోతీనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న డాక్టర్ ఎస్వీ ప్రసాద్

మోతీనగర్: ఆకలితో అలమటిస్తూ ఉన్న అనాథలకు పట్టెడన్నం పెట్టడంలోనే తృప్తి కలుగుతుందని మోతీనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ. ప్రసాద్ అన్నారు. బుధవారం మోతీనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఎర్రగడ్డ మానసిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌సీహెచ్ఎస్ మాజీ అధ్యక్షులు బిజముల్ల నాగేశ్వరరావు, నలమాల్పు అంజిరెడ్డి, సభ్యులు కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సిద్ధార్థ డిగ్రీ, పీజీ కో ఎడ్యుకేషన్ కాలేజీలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రెసిడెంట్ భాస్కరరావు, కళాశాల డైరెక్టర్లు మధుసూదన్‌రావు, ఎస్. అరవింద్‌రావు, ప్రిన్సిపాల్స్ ఏ. పద్మప్రియ, ఎస్. చంద్రశేఖర్‌నాథ్ హాజరయ్యారు. 100 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- పక్కనున్న టీ టైం షాపులోకి మంటలు
- సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం
- బయటకు పరుగులు తీసిన సిబ్బంది
- మంటలార్పిన ఫైరింజన్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ





మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మూసాపేట: కైత్లాపూర్‌లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. పక్కనున్న టీ టైం షాపులోకి కూడా మంటలు వ్యాపించాయి. ఈ ఘటన బుధవారం జరిగింది. కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్ అధికారి జగన్మోహన్ వివరాల ప్రకారం... కైత్లాపూర్‌లోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అన్నం వండే క్రమంలో రెగ్యులేటర్ ఆన్ చేసేటప్పుడు గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. చిన్న షెడ్డు కావడంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌తో పాటు టీ టైం షాపులోకి మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బయటకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వస్తున్నారు. రెండు కమర్షియల్ ఫ్రిజ్‌లు, రెండు సాధారణ ఫ్రిజ్‌లు, టీ మేకింగ్ మెటీరియల్, ఫర్నిచర్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: ఎస్సీ వర్గీకరణ బిల్లుపై అసెంబ్లీలో చర్చించి ఆమోదం తెలిపిన సందర్భంగా బుధవారం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచుకున్నారు. 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను పట్టువదలని విక్రమార్కుడిలా ముందుకు తీసుకువెళ్లిన మందకృష్ణ మాదిగకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు మాధవి కుమారి, డా. తారా కల్యాణి, డా. వసుమతి, డా.రమేష్ చంద్ర, వెంకటేష్, డా. సైదానాయక్, విద్యార్థి నాయకులు డా. బొట్ల భిక్షపతి, బల్గర్ సందీప్, ఆదిమల్ల పవన్‌కుమార్, సన్నీ, దిలీప్, విక్రాంత్, మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్



పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మహేందర్, నాయకులు

మోతీనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైందని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. మోతీనగర్ చౌరస్తాలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించే పార్టీ బీజేపీ అని అన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు చేసే అసత్య ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్రస్వామి, నాయకులు మల్లేష్ గౌడ్, సద్గుణ రెడ్డి, ఐలయ్య, భాస్కర్, సతీష్ చారి, శ్రీనివాస్‌చారి, రవి గౌడ్, ప్రశాంత్ రెడ్డి, శోభరాజన్, బసవరాజ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల ఆమోదంపై కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన బిల్లులను ఆమోదించడంపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి మాట్లాడుతూ.. బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అండగా ఉంటామన్నారు. అదేవిధంగా నల్లగండ్ల గ్రామంలో కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలకు కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో దోరపల్లి పరశురాములు, నాగుల మల్లేష్, బొల్లం యాకయ్య, యాదగిరి, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని సెవెన్ హిల్స్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, శ్రీ చక్ర పెరుమాళ్ స్నానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో నేడు సీపీఆర్‌పై అవగాహన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించనున్నట్లు ఫెస్కో అధ్యక్షుడు దొండపాటి రామచంద్రా రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఆర్‌పై అనుభవం ఉన్న డాక్టర్ అపర్ణ ప్రయోగాత్మకంగా తెలియజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పూర్ణ కుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రశాంతి నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పురోహితులు ఎమ్మెల్యేను వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

ఆర్‌డబ్ల్యూఏ సభ్యుల ప్రయోజనాలను కాపాడాలి

మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కోరిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ, ఆర్‌డబ్ల్యూ సభ్యులు

గచ్చిబౌలి: రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యుల ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీస్ సైబరాబాద్-ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులతో కలిసి నగరంలోని మంత్రులు నివాస ప్రాంగణంలో మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్-2001 ప్రకారం నమోదు చేయబడిని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) చట్టపరమైన స్థితిని సమర్థించడం, వేలాది మంది ఆర్‌డబ్ల్యూలకు ప్రయోజనం చేకూర్చడం వంటి అంశాలను మంత్రికి వివరించారు. టీఎస్ఆర్ఏ-2001 కింద నమోదైన ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీలు ఈ ఫెడరేషన్‌లో సభ్యులుగా ఉన్నారని, వీరిలో దాదాపు అందరూ తమ ఆర్‌డబ్ల్యూలను టీఎస్ఆర్ఏ-2001 కింద నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాంధీ వివరించారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కావూరి అనిల్, ఎఫ్‌జీసీసీ అసోసియేషన్ సభ్యులు సాయిరవిశంకర్, మాగంటి సత్యనారాయణ, హరిప్రసాద్, శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



వర్గీకరణకు మద్దతుగా దప్పు కొడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద వెయ్యి గొంతులు, లక్ష దప్పుల కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఎస్సీ వర్గీకరణ చేయాలని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి సంవత్సర కాలం అయినా రేవంత్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఎప్పుడు ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



సమస్య తెలుసుకుంటున్న సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. స్థానికుల ఫిర్యాదుతో బుధవారం ఆమె బస్తీలో పర్యటించారు. తాగునీటి సప్లయ్ కొరత ఉందని, మంచినీరు కలుషితంగా సరఫరా అవుతున్నాయని, సీసీ రోడ్లు, విద్యుత్‌దీపాల సమస్యలను స్థానికులు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో జాహెద్ షరీఫ్ బాబా, రాజు, బద్రినాయక్, బ్రహ్మ, కల్యాణ్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, అప్పన్న, శంకర్, కొండయ్య, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి పాటుపడాలి



ఎమ్మెల్యేతో అల్లాపూర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాధవాచారి తదితరులు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన సీహెచ్ మాధవాచారి బుధవారం ఎమ్మెల్యేను కలవడంతో వారిని ఆయన సన్మానించి మాట్లాడారు. సంక్షేమ సంఘాలు ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో అభివృద్ధి కోసం కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు లింగం, ఆర్ రాజయ్య చారి, రవీందర్, శ్యాంసుందర్‌రెడ్డి, శంకర్, సాంబయ్య, బాబురావు, ప్రసాద్, అజార్, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక నాయకులు

బాలానగర్: నియోజకవర్గంలోని శ్రీశ్రీ నగర్ మెయిన్ రోడ్డులో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను బుధవారం కార్మికులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. శ్రీనివాస్, కూకట్‌పల్లి కార్యదర్శి జి, కృష్ణ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ దేశంలోని బడా కార్పొరేట్‌లకు అనుకూలంగా, పేద ప్రజలకు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎన్ని పోరాటాలు చేస్తున్నా బీజేపీ మొద్దు నిద్రలో ఉందన్నారు. దేశాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేయడమే మోదీ విధానంలా కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, రాములు, పి. శంకర్, లక్ష్మి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ జాతరకు వేళాయే

మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో ప్రతి సంవత్సరం వేడుకలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండవ అతిపెద్ద జాతరగా సూరారం కట్టమైసమ్మ జాతర పేరొందింది. ఎన్నో ఏళ్లుగా మైసమ్మ అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది. మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో ప్రతి సంవత్సరం జాతర జరుగుతోంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

– సూరారం



- 8 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

ఆలయ చరిత్ర

నిజాం హయాంలో షేక్ అబ్దుల్ పాషా నవాబ్ సంస్థానంలో సూరారం గ్రామం భాగంగా ఉండేది. అప్పట్లో సూరారం గ్రామానికి చెరువును తవ్వించి కట్ట నిర్మించారు. పలుమార్లు ఆ కట్ట కూలిపోయింది. చెరువు పనుల్లో కూలిగా పని చేస్తున్న సూరయ్య అనే గ్రామస్తుడు నవాబు వద్దకు వెళ్లి.. కట్ట పదే పదే కూలిపోతోందని, అక్కడ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే బాగుంటుందని తెలిపాడు. దీంతో చెరువు కట్టను నిర్మించి దానిపై మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా కట్ట కూలిపోకుండా అలాగే నిలిచిందని పెద్దలు చెబుతుంటారు. అంతే కాకుండా అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరే భక్తుల అభీష్టాలను తీర్చే కల్పతరువుగా విరాజిల్లుతూ వచ్చింది. ఈ క్రమంలో 1999లో కట్ట మీదుగా వెళ్తున్న ఓ డీసీఎం అదుపు తప్పి అమ్మవారి గుడికి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొట్టడంతో ఆలయం ధ్వంసమైంది. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించిన గ్రామస్తులు 2002 ఆలయాన్ని పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి ప్రత్యేక జాతరను నిర్వహిస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

కట్టమైసమ్మ జాతరను పురస్కరించుకుని సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి నుంచి జ్యోతి మిల్క్ ఫ్యాక్టరీ వరకు వన్‌వే చేసినట్లు జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు. భారీ వాహనాలను సూరారం గ్రామం మీదుగా గండిమైసమ్మకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

జాతర వివరాలు..

సూరారం చెరువు కట్టపై వెలిసిన కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు ఈ నెల 8న ప్రారంభం కానున్నాయి. నగరంతో పాటు మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. 8న జాతర మొదటి రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత స్నానంతో జాతర మొదలవుతుంది. ఉదయం 8 గంటలకు పుణ్యాహవాచనం, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, నవవర్ణ జప హోమం, మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం, తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పణ, సాయంత్రం 5 గంటలకు సూరారంలోని శ్రీరామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుంది. 9న ఉదయం 5 గంటలకు ప్రత్యేక అలంకరణ, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడి బియ్యాలు, బోనాల సమర్పణ, మొక్కుల చెల్లింపులు, 10న రంగం, భవిష్యవాణి, పోతరాజుల విన్యాసాలు, ఫలహారబండి ఊరేగింపు, ఉంటాయి. 12న మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్, బాలానగర్ చౌరస్తా, నర్సాపూర్‌ల నుంచి ప్రతి 15 నిమిషాలకు ఓ బస్సు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462